RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 4 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | గురువారం, 11 జూలై 2024 | పేజీలు : 4 | వెల : 2/-



# తెలంగాణలో చంద్రబాబు అద్భుత వ్యూహం ఫలిస్తుందా?

అమరావతి : ఏపీ ఎన్నికల్లో గెలిచారు చంద్రబాబు.జనసేన, బిజెపితో జతకట్టి మరి జగన్ ను మట్టి కరిపించారు. అటు తెలంగాణలో సైతం కేసీఆర్ ను అక్కడ ప్రజలు తిరస్కరించారు.ఏపీ మాదిరిగానే భావోద్వేగాలు కనుమరుగయ్యాయి. తెలుగు రాష్ట్రాల ప్రజలు అభివృద్ధిని ఆహ్వానిస్తున్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే తెలంగాణలో టిడిపి పూర్వవైభవానికి అద్భుత వ్యూహంతో ముందుకు సాగుతున్నారు చంద్రబాబు. ప్రధానంగా ఆంధ్రా సెటిలర్స్ ఆధారంగా చేసుకుని రాజకీయాలను నడపాలని భావిస్తున్నారు. తద్వారా టిడిపి పూర్వ వైభవానికి తహతహలాడుతున్నారు.

**సెటిలర్స్ ప్రభావం అధికం..** తెలంగాణలో సెటిలర్స్ ప్రభావం అధికం. ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమించింది టిఆర్ఎస్. కానీ సెటిలర్స్ అధికంగా ఉన్న గ్రేటర్ హైదరాబాద్,నల్గొండ,ఖమ్మం జిల్లాల్లో ఆ పార్టీ పట్టు సాధించలేకపోయింది.గ్రేటర్ హైదరాబాదులో సత్తా చాటేందుకు చాలా రోజుల సమయం పట్టింది. అయితే క్రమేపీ తెలంగాణ సెంటిమెంట్ బలంగా వ్యాపించింది. సెటిలర్స్ సైతం సెంటిమెంట్ కు జై కొట్టక తప్పలేదు. టిఆర్ఎస్ దూకుడుకు సెటిలర్స్ తల వంచాల్సి వచ్చింది.అయితే భయపెట్టే టిఆర్ఎస్ పోయింది. ఎటువంటి ఇబ్బందులు పెట్టని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.అదే సమయంలోసెటిలర్స్ కు బిజెపి భరోసా ఇస్తోంది.అందుకే ఇప్పుడు సెటిలర్స్ ప్రభావం అధికంగా ఉంది.స్వేచ్ఛగా వ్యవహరించే పరిస్థితి కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు రంగంలోకి దిగారు చంద్రబాబు.టిడిపి పూర్వవైభవాన్ని బలంగా కోరుతున్నారు. దానికి సెటిలర్స్ మద్దతు కూడగడుతున్నారు.

**క్యాడర్ యూ టర్న్..** పేరుకే టిఆర్ఎస్ అలియాస్ బిఆర్ఎస్..కానీ అక్కడ ఉన్నదంతా టిడిపి కేడరే.తెలుగుదేశం పార్టీలో ఒక వెలుగు వెలిగిన నాయకులు కెసిఆర్ ఆడిన రాజకీయంతో ఆయన గూటికి చేరక తప్పలేదు. అటు క్యాడర్ సైతం బలవంతంగా ఆ పార్టీలో సర్దుబాటు అవుతూ వచ్చింది.అయితే ఇప్పుడు తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో కెసిఆర్ ను వద్దనుకున్నారు. అందుకే ఆ పార్టీ క్యాడర్ ను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ తో పాటు బిజెపి ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే పూర్వాశ్రమంలో టిడిపి క్యాడర్ కావడంతో ఆలోచనలో పడింది. ఇప్పుడు చంద్రబాబు పిలుపు మేరకు ఆ క్యాడర్ కొంత టిడిపి వైపు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**ఏపీలో సక్సెస్ తో..** ఏపీలో కూటమి సక్సెస్ అయ్యింది. మూడు పార్టీలను ప్రజలు ఆహ్వానించారు. ఆశీర్వదించారు కూడా. అందుకే తెలంగాణలో సైతం ఆ మూడు పార్టీలు కలిస్తే మంచి ఫలితాలు వస్తాయని అంచనాలు ఉన్నాయి. 2014, 2018 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఒంటరి పోరు చేసింది.

కానీ అనుకున్న స్థాయిలో సీట్లను దక్కించుకోలేకపోయింది. ఇప్పుడు టిడిపి పూర్వవైభవం దిశగా అడుగులు వేస్తే మంచి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. సెటిలర్స్ అధికంగా ఉండే ప్రాంతాల్లో ఓటు బ్యాంకు పెంచుకునే ఛాన్స్ కనిపిస్తోంది. చంద్రబాబుకు పవన్ బలం తోడైతే అదనపు బలమే. దీనికి బిజెపి దూకుడు తోడైతే.. ఏపీ ఫలితాలు రిపీట్ చేయవచ్చని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కూటమిని ఒక తుది రూపానికి తేవాలని భావిస్తున్నారు. అది ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.

## ఫోన్ ట్యాపింగ్ కేసుపై హై కోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసుపై తెలంగాణ హై కోర్టులో ఈరోజు విచారణ జరిగింది. ఈ కేసుపై ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ విషయంలో మీడియా సంయమనం పాటించాలని సూచించింది. వ్యక్తిగత జీవితాల్లోకి వెళ్లి అనవసర రాద్ధాంతం చేయొద్దని స్పష్టం చేసింది. జడ్జీలు, వారి కుటుంబ సభ్యుల పేర్లు ఫోన్ నెంబర్లు, ఫొటోలు బహిర్గతం చేయొద్దని హైకోర్టు ఆదేశించింది. కొన్ని పత్రికల్లో జడ్జి పేరు, మొబైల్ నెంబర్ ప్రచురించినట్లు కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ విషయంలో మీడియా సంయమనం, బాధ్యతతో వ్యవహరిస్తుందని నమ్ముతున్నామని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఫోన్‌టాపింగ్ కేసుకు సంబంధించిన వార్త రాసేటప్పుడు మీడియా జాగ్రత్తగా ఉండాలని చెప్పింది. ఫోన్ టాపింగ్ కేసులో ఇప్పటికే ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేశారని గుర్తుచేసింది. అందుకే ప్రస్తుతానికి ఎలాంటి ఆదేశాలు ఇవ్వాలనుకోవడం లేదని ధర్మాసనం పేర్కొంది. ఈనెల 23న కౌంటర్ దాఖలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పిన విషయం తెలిసిందే. తదుపరి విచారణను 23కు హైకోర్టు వాయిదా వేసింది. కాగా... పోలీసు శాఖతో పాటు రాజకీయపరంగా కలకలం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో దర్యాప్తును ప్రభుత్వం వేగవంతం చేసింది. ప్రణీత్ రావు ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో రోజుకో కొత్త అంశం బహిర్గతమవుతోంది. ఎస్ఐబి కార్యాలయంతో పాటు ఇతర ప్రైవేటు ప్రదేశాల్లోనూ ఫోన్ ట్యాపింగ్ చేశారని ప్రధాన ఆరోపణలు వినిపిస్తుండగా, పోలీసులు ఆ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. మాజీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు, సీఐ గట్టు మల్లును పోలీసులు విచారించిన విషయం తెలిసిందే.

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం




హైదరాబాద్: తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి జితేందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు డీజీపీగా ఉన్న రవి గుప్తాను హెూంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నూతన డీజీపీగా నియమితులైన జితేందర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

**నిర్మల్ ఏఎస్పీ నుంచి డీజీపీ దాకా..** పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో రైతు కుటుంబంలో జన్మించిన జితేందర్ 1992 ఐపీఎస్ బ్యాచ్ అధికారి. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. తొలుత నిర్మల్ ఏఎస్పీగా పనిచేసిన అనంతరం బెల్లంపల్లి అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తించారు.

అప్పట్లో నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాల ఎస్పీగా ఉన్నారు. తర్వాత ఢిల్లీ సీబీఐలో.., 2004-06 వరకు గ్రేహౌండ్స్‌లో పనిచేశారు. అనంతరం డీఐజీగా పదోన్నతి పొంది విశాఖపట్నం రేంజ్‌లో బాధ్యతలు నిర్వర్తించారు. అప్పాలో కొంతకాలం పనిచేసి తెలంగాణ ఉద్యమం సమయంలో వరంగల్ రేంజ్ డీఐజీగా కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ సీఐడీ, ఎంక్వయిరీ కమిషన్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో బాధ్యతలు నిర్వర్తించిన అనంతరం హైదరాబాద్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా పనిచేశారు. తర్వాత తెలంగాణ శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీగా, జైళ్లశాఖ డీజీగా పనిచేశారు.

ప్రస్తుతం హెూంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఆయన 2025 సెప్టెంబరులో పదవీవిరమణ చేయనున్నారు.

# రైతులను ఇబ్బంది పెట్టొద్దు

## ఆర్ఆర్ఆర్ భూ సేకరణపై కీలక ఆదేశాలు



హైదరాబాద్: జాతీయ రహదారులకు భూ సేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. నిబంధనల ప్రకారం ఎంత ఎక్కువ పరిహారం వస్తుందో అంత రైతులకు దక్కేలా చూడాలని అన్నారు. తెలంగాణలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ఏఐ) పరిధిలో రహదారుల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నుంచి సహకారం ఉన్నా భూ సేకరణ ఎందుకు ఆలస్యమవుతోందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువ ఉండడం, మార్కెట్ ధరలు ఎక్కువగా ఉండడంతో భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదని కలెక్టర్లు తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి తరతరాలుగా వస్తున్న భూములను రైతులు శాశ్వతంగా కోల్పోతున్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. కలెక్టర్లు రైతులతో పిలిచి మాట్లాడి వారిని ఒప్పించాలని సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం, ఉత్తర భాగం వేర్వేరుగా చూడొద్దని, ఆ రెండింటికి కలిపి ఒకే నెంబర్ కేటాయించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరగా, ఆయన సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఆ ప్రక్రియకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఎన్ హెచ్ఏఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందం (ట్రైపార్టియేట్ అగ్రిమెంట్) కుదుర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. వెంటనే దానిని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణలో ఉన్న ఆటంకాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అలైన్ మెంట్ విషయంలో పొరపడి కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారని, దాంతో హైకోర్టు స్టే ఇచ్చిందని యాదాద్రి భువనగిరి కలెక్టర్ హన్మంత్ కె.జెండగే తెలిపారు. స్టే తొలగింపునకు వచ్చే శుక్రవారం నాటికి కౌంటర్ దాఖలు చేయాలని కలెక్టర్ కు ముఖ్యమంత్రి సూచించారు. నాగ్ పూర్-విజయవాడ కారిడార్ లో ఖమ్మం జిల్లాలో భూ సేకరణ పరిస్థితి ఏమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఖమ్మం సమీపంలోని విలువైన భూముల గుండా రహదారి పోతుందని, పరిహారం విషయంలో రైతులను ఒప్పిస్తున్నామని ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తల్లాడ-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు సాగుతున్నందున, ప్రస్తుతం ఖమ్మం నుంచి అశ్వారావుపేట వరకు ఉన్న జాతీయ రహదారిని రాష్ట్ర రహదారిగా మార్చుకోవాలని ఎన్ హెచ్ఏఐ అధికారులు సూచిస్తున్నారని, దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించవద్దని, జాతీయ రహదారిగానే దానిని కొనసాగించాలని మంత్రి తుమ్మల అభిప్రాయం వ్యక్తం చేశారు. హైదరాబాద్ -మన్నెగూడ రహదారి పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. అందుకు ఎన్‌హెచ్ ఏఐ అధికారులు అంగీకరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ నాగ్ పూర్-విజయవాడ కారిడార్ లో భాగంగా నిర్మిస్తున్న రహదారిలో పెద్ద గ్రామాలున్న చోట సర్వీసు రోడ్లు నిర్మించాలని, రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా అవసరమైన చోట్ల అండర్ పాస్ లు నిర్మించాలని ఎన్ హెచ్ఏఐ అధికారులను కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్ చౌదరి బదులిచ్చారు. జాతీయ రహదారుల వెంట వ్యవసాయ వాహనాలు, రైతులు వినియోగించుకునేలా గ్రావెల్ రోడ్లు నిర్మించాలనే ప్రతిపాదన సమీక్షలో వచ్చింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్ చౌదరి తెలిపారు. గ్రావెల్ రహదారి నిర్మించడం వలన రైతులకు ఉపయోగపడడంతో పాటు భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఇబ్బందులు ఉండవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

**సమన్వయంతో ముందుకు సాగండి...** ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల, విజయవాడ-నాగ్ పూర్ కారిడార్ రహదారులకు సంబంధించి అటవీ శాఖ భూముల బదలాయింపు సమస్య సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వచ్చింది. స్పందించిన ముఖ్యమంత్రి అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని నిజామాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ విషయంలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను అటవీ శాఖకు బదలాయించి అటవీ శాఖ భూములను తీసుకొని రహదారుల నిర్మాణానికి ఉన్న ఆటంకాలను తొలగించాలని ముఖ్యమంత్రి సూచించారు. వివిధ శాఖల పరిధిలోని యుటిలిటీస్ తొలగింపునకు సంబంధించి చెల్లింపులు వేగవంతం చేయాలని, ఏవైనా సమస్యలుంటే ఎన్ హెచ్ఏఐతో సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు.

**రెండు నెలల్లో హైదరాబాద్-విజయవాడ విస్తరణ పనులు...** హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసల విస్తరణ పనులకు భూ సేకరణ పూర్తయినందున వెంటనే పనులు చేపట్టాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు మెంబర్ అనిల్ చౌదరిని కోరారు. రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన బదులిచ్చారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ఓఎస్డీలు శేషాద్రి, మాణిక్ రాజ్, చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, మౌలిక వసతుల సలహాదారు శ్రీనివాసరాజు, ఎన్ హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి రజాక్, పీసీసీఎఫ్ డోబ్రియల్, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందన, జాయింట్ సెక్రటరీ హరీష్, మెదక్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, నిజామాబాద్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

### రేవంత్ మెడకు చుట్టుకోవడం ఖాయమేనా ?

తెలంగాణ నిరుద్యోగుల సమస్య నివురు గప్పిన నిప్పులా ఉంది. ఎన్నికలకు ముందు నిరుద్యోగుల అండతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలు తిరగకుండానే బద్ధశత్రువులా మారిపోయింది. గ్రూప్ 1,2,3 పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ మోతాలాల్ నాయక్ అనే నిరుద్యోగి 9 రోజులు నిరాహార దీక్ష చేపట్టడంతో మొన్నటి వరకు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం నుండి స్పందన రాకపోవడంతో అతడి దీక్ష విరమించాడు. ఇక ఆ వెంటనే డీఎస్సీ వాయిదా వేయాలని, పోస్టులు పెంచి మెగా డీఎస్సీ వేయాలని నిరుద్యోగులు భారీ నిరసన చేపట్టారు. డీఎస్సీకి, గ్రూప్ 2 పరీక్షలకు వ్యవధి తక్కువగా ఉన్నందుకు ప్రభుత్వం డీఎస్సీ వాయిదా వేయాలన్నది అభ్యర్థుల ఆందోళన. అయితే ఈ నిరసనల వెనక కోచింగ్ సెంటర్ల యజమానుల కుట్ర ఉందని, వాయిదా వేస్తే శిక్షణల పేరుతో ఒక్కొక్క సెంటర్ రూ.100 కోట్లు ఆర్జిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. దీంతో డీఎస్సీ వాయిదా కోసం పట్టుబడుతున్న వారు సోషల్ మీడియాలో ఆందోళనకర వీడియోలను విడుదల చేస్తున్నారు. డీఎస్సీ వాయిదా వేయాలన్న మా డిమాండ్ వెనక ఎవరూ లేరని, మేము స్వచ్ఛంధంగా చేస్తున్న డిమాండ్ అని, డీఎస్సీకి కేవలం 20 రోజుల సమయమే ఉందని, తాము 6వ తరగతి నుండి ఇంటర్ వరకు పుస్తకాలు చదవాల్సి ఉన్నందున మా మీద తీవ్ర వత్తిడి ఉందని, ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల మీద ఆశలు పెట్టుకున్నామని, సమయాభావం మూలంగా ఉద్యోగం రాకుంటే ఆత్మహత్యలే శరణ్యం అని, మాకు చదువుకోవడానికి సమయం ఇవ్వాలని అభ్యర్థులు వీడియోలు విడుదల చేస్తున్నారు. దీంతో నిరాశలో ఉన్న ఆ అభ్యర్థుల వివరాలు తెలుసుకుని వారు ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడకుండా ఓదార్చుతున్నారు. ఈ నేపథ్యంలో ఎవరైనా ఏ మాత్రం వత్తిడికి లోనై ఏమైనా చేసుకుంటే ప్రభుత్వం మెడకు చుట్టుకునే అవకాశం ఉంది.

# ఇప్పటికైనా మార్పు వచ్చేనా!



గోదావరిఖని : రామగుండం కార్పొరేషన్‌పై జిల్లా పాలనాధికారి ప్రత్యేక దృష్టి సారించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకోవడంతో నగరపాలిక నిర్వహణ మెరుగు పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు చేస్తానని, నిర్వహణ తీరు మెరుగు పరచుకోకుంటే చర్యలు తప్పవని శనివారం నిర్వహించిన నగరపాలిక సమీక్షలో కలెక్టర్ పేర్కొన్నారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడంటూ పారిశుద్ధ్య తనిఖీ అధికారిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. సుదీర్ఘకాలంగా విధులకు గైర్హాజరవుతున్న బిల్ కలెక్టర్‌ను సస్పెండ్ చేశారు.

**పడకేసిన పారిశుద్ధ్యం... కానరాని సమయపాలన**

నగరపాలక ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించేందుకు ముగ్గురు అధికారులతో పాటు వారికి సహాయకులుగా 12 మంది పారిశుద్ధ్య పర్యవేక్షకులున్నారు. క్షేత్రస్థాయిలో సహాయ పర్యవేక్షకులు మాత్రమే పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపడుతుండగా పర్యవేక్షకులు మాత్రం అప్పుడప్పుడు క్షేత్రస్థాయి పర్యవేక్షణకు వెళుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒకరిపై ఒకరు ఆరోపణలు గుప్పించుకోవడం మినహా పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇంటింటా చెత్త సేకరణ మొదలుకొని సేంద్రియ ఎరువు తయారీలో ఒకప్పుడు రామగుండం నగరపాలిక ముందంజలో ఉండగా ఇప్పుడు పూర్తిగా గాడి తప్పింది. రహదారుల వెంట చెత్తకుప్పలు దర్శనమిస్తూనే ఉన్నాయి. నగరపాలక కార్యాలయంలో తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని జిల్లా పాలనాధికారి ఆదేశించడంతో సమయపాలన కొంత మెరుగు పడే అవకాశమున్నట్లు పలువురు భావిస్తున్నారు. పారిశుద్ధ్య విభాగంలోని కొందరు కార్మికులు ఒకరికి బదులుగా ఒకరు విధులకు వస్తుండగా కొందరు విధులకు రాకుండానే వేతనాలు పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు తాజా, మాజీ ప్రజాప్రతినిధుల ఇళ్లల్లో పనిచేస్తున్నట్లు సమాచారం. నగరపాలక కమిషనర్‌గా శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టిన వెంటనే వీటిపై దృష్టి సారించి ఇళ్లల్లో పనిచేసేవారిని వెనక్కి పిలిపించడంతో పాటు హాజరులో అక్రమాలను అరికట్టేలా నిరంతరంగా క్షేత్రస్థాయి పర్యటన చేపట్టడంతో కొంత మేరకు ప్రయోజనం చేకూరుతోంది. తమకు బిల్లుల చెల్లింపుల్లో సంబంధిత విభాగానికి చెందిన ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ గుత్తేదారులు స్వయంగా జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేయడం గమనార్హం. కార్పొరేషన్‌లో డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా ఉంది. నగరంలో సేకరించిన చెత్తను ఎక్కడ పడేయాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో గోదావరి ఒడ్డున వ్యర్థాలను పడేస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం**

**– సీహెచ్.శ్రీకాంత్, రామగుండం నగరపాలక కమిషనర్**

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు ప్రణాళికాబద్ధంగా నిర్వహణను మెరుగు పరుస్తాం. నగరంలోని పారిశుద్ధ్య కార్మికులంతా పనులు నిర్వహించాల్సిందే. బయోమెట్రిక్ యంత్రాలను తెప్పించేందుకు టెండరు పిలిచాం. త్వరలోనే పూర్తిస్థాయిలో బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తాం. నగరపాలికలోని వివిధ విభాగాల్లో సమయపాలన, నిర్వహణను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

# కలగా సాంకేతిక విద్య



ముస్తాబాద్ : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం డిజిటల్ విద్యకు శ్రీకారం చుట్టింది. కొన్నాళ్లు సక్రమంగానే సాగినప్పటికీ తరవాత మూలకు చేరింది. బోధకులు లేకపోవడం, పాఠశాల ఉపాధ్యాయులకు సాంకేతిక విద్యపై అవగాహన లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు కంప్యూటరు విద్య అందని ద్రాక్షగా మారింది. జిల్లాలోని అన్ని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నిట్) ద్వారా 2009 సంవత్సరంలో కంప్యూటర్ విద్యను ప్రారంభించారు. ఒక్కో పాఠశాలకు దాదాపు 5 నుంచి 10 కంప్యూటర్లు, జనరేటర్ 1, యూపీఎస్–1, టేబుళ్లు, కుర్చీలు అందజేశారు. ప్రతి పాఠశాలకు ఔట్‌సోర్సింగ్ ద్వారా ఇద్దరు కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి విద్యార్థులకు కంప్యూటర్ విద్యను బోధించారు. ఒక్కొక్కరికి రూ. 2,500 చొప్పున గౌరవ వేతనం చెల్లించారు. ఆ స్కీం 2013 సంవత్సరం వరకు కొనసాగింది. గడువు ముగియడంతో తరవాత కంప్యూటర్లు మూలన పడ్డాయి. కొన్ని పాఠశాలల్లో ఒకటి, రెండు మాత్రం వినియోగంలో ఉన్నట్లు సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు చెబుతున్నారు.

**కంప్యూటర్ ఛాంప్స్ పేరుతో...**

జిల్లాలో 2023 జూన్‌లో అప్పటి కలెక్టర్ కంప్యూటర్ ఛాంప్స్ పేరుతో జిల్లాలో 60 పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను ప్రారంభించారు. ఆరు నుంచి పదో విద్యార్థులకు కంప్యూటర్ (సాంకేతిక) విద్య అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని ద్వారా సుమారు 12 వేల మంది పిల్లలకు ఉపయోగం కలుగుతుందని భావించారు. ఒక్కో తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడు చొప్పున బోధించేలా బాధ్యతలు అప్పగించారు. కంప్యూటర్ లేని పాఠశాలలకు కంప్యూటర్ ఉన్న పాఠశాలలను అనుసంధానం చేసి విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేలా చూడాలన్నారు. జిల్లా కేంద్రం ద్వారా ప్రశ్నపత్రాలు పంపించి నెలకోసారి పరీక్షలు నిర్వహించేవారు. విద్యార్థులు కూడా ఆసక్తి చూపేవిధంగా ప్రోత్సహించేవారు. అటు రెగ్యులర్ తరగతులతోపాటు సాంకేతిక విద్యను బోధించడంలో ఉపాధ్యాయులు తలమునకలయ్యేవారు. అయితే సరిపడా కంప్యూటర్లు లేకపోవడం, మరోవైపు సాంకేతిక బోధనలో ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో పరిజ్ఞానం లేక మళ్లీ మూలకు చేరిందని పలువురు చెబుతున్నారు. దీనికి తోడు పిల్లలు పాఠశాల స్థాయి నుంచి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో పలువురు దాతలు కొన్ని స్కూళ్లకు కంప్యూటర్లను వితరణ చేశారు. ఇవి కూడా అలంకారప్రాయంగానే ఉన్నాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించి బోధించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**బోధిస్తే మేలు**

**గీస అక్షిత, 8వ తరగతి, పోత్గల్ జడ్పీ పాఠశాల**

మా పాఠశాలలో కంప్యూటర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించి కంప్యూటర్ విద్యను నేర్పించాలి. నేటి ప్రపంచంలో పాఠశాల స్థాయి నుంచి ఇది చాలా అవసరం. ఉన్నత తరగతుల్లో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకు అనుగుణంగా బోధించాలి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణించేలా ప్రోత్సహించాలి.

**దృష్టి సారిస్తాంరాజిరెడ్డి, మండల నోడల్ అధికారి**

ఇప్పటికే పలు పాఠశాలల్లో కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయులతో విద్యార్థులకు బోధిస్తున్నాం. ఏయే పాఠశాలల్లో ఎన్ని ఉన్నాయి, వాటిలో ఎన్ని పని చేస్తున్నాయి అనేది ప్రధానోపాధ్యాయుల ద్వారా తెలుసుకుంటాం. ఉన్నతాధికారుల సూచనలు, సలహాలతో అన్ని పాఠశాలల్లో బోధించేలా చూస్తాం.

# నీటి శుద్ధికి సాంకేతిక సమస్యలు

కరీంనగర్ : నగర అవసరాలకు అనుకూలంగా తాగునీరు సరఫరా చేసేందుకు వినియోగిస్తున్న నీటి శుద్ధి కేంద్రం విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. జలాన్ని శుద్ధి చేయడంలో సాంకేతిక సమస్యలు వస్తుండగా.. మరమ్మతు చేయడంలో జాప్యం చేస్తున్నారు. అదనపు మోటార్లు ఇప్పటికే చెడిపోగా, పని చేస్తున్న మోటార్లు పాడైతే పరిస్థితి ఏమిటనే ప్రశ్నకు సమాధానం లేకుండా మారింది. కరీంనగర్ నగరవాసులకు పాత ఫిల్టర్‌బెడ్‌తోపాటు కొత్తగా నిర్మించిన మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. డ్యాంలో జలాల నిల్వలు తక్కువగా ఉండటంతో బూస్టర్ పంపుల ద్వారా పంపింగ్ చేసుకొని ఫిల్టర్‌బెడ్‌కు పంపిస్తున్నారు. ఇక్కడ పలుమార్లు శుద్ధి చేసి పరీక్షలు చేసిన తర్వాత శుద్ధజలం నగరవాసులకు పంపిణీ చేస్తున్నారు.

**పని చేయని క్లోరినేషన్ ప్లాంట్..**

34 ఎంఎల్‌డీల సామర్థ్యంగల ఫిల్టర్‌బెడ్‌కు వినియోగిస్తున్న క్లోరినేషన్ ప్లాంట్ ఎనిమిది నెలలుగా పని చేయడం లేదు. మిషన్ భగీరథతోనే ఉపయోగించుకుంటుండగా, అవసరమైన సందర్భాల్లో ఆలం మోతాదు పెంచుతున్నట్లు తెలుస్తోంది. మోటారు చెడిపోవడమే కారణమంటున్నారు. చిత్రాలు తీయడంతో ఆగమేఘాల మీద శుక్రవారం మరమ్మతులు చేసి బిగించారు.

**రంగు మారకుండా జాగ్రత్తలు అవసరం**

పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో క్రమేనా కొత్త నీరు వచ్చే అవకాశముంది. శుద్ధజలం రంగు మారే ప్రమాదముంది. దీనికి క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది.

**చేయాల్సినవి ఇవీ**

34 ఎంఎల్‌డీ ఫిల్టర్‌బెడ్‌లో జనరేటర్ తీసుకొచ్చి మూడేళ్లు అవుతుంది. ప్యానల్ బోర్డు బిగించాల్సి ఉండగా, ఇప్పటికీ ఆ పని పూర్తి చేయడంలేదు. విద్యుత్తు సరఫరా నిలిచిన సమయంలో గంటల తరబడి నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది.

350 హెచ్‌పీ మోటారుకు, పంపు బిగించి పెట్టారు. గుత్తేదారుకు వర్క్‌ఆర్డర్ ఇస్తే ఆ పనులు పూర్తి చేస్తారు.

కొత్త మిషన్ భగీరథలో 370 హెచ్‌పీ గల రెండు మోటార్లు చెడిపోయి ఏడాది అవుతుంది. ఆరవ నంబర్ మోటారు కాలిపోయి రెండేళ్లు అవుతుంది. మిగతా మోటార్లు నిరంతరంగా పని చేస్తుండటం, వేడి కావడంతో తరచుగా నిలిపివేస్తున్నారు.

ఇవే కాకుండా చిన్న, చిన్న సమస్యలు ఉండగా వాటిని కూడా పరిష్కరించకుండా వదిలేస్తున్నారు. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తే నీటి శుద్ధికి అంతరాయమే ఉండదు.

**వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం**

ఫిల్టర్‌బెడ్‌లో మోటార్ల మరమ్మతులు, జనరేటర్ దగ్గర ప్యానల్ బోర్డు బిగించేందుకు టెండర్లు పిలిచాం. గుత్తేదారుకు పలుమార్లు ఆదేశించాం. మరోసారి ఒత్తిడి తెచ్చి వారం రోజుల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. క్లోరినేషన్ ప్లాంటు నడుస్తోంది. లచ్చిరెడ్డి, డీఈఈ, నగరపాలిక

# సాంకేతిక విద్య.. వసతులు మిథ్య

పెద్దపల్లి : జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల.. దేశ, విదేశాల్లో ఎంతో మంది సాంకేతిక పట్టభద్రులు జీవితంలో స్థిరపడేలా చేసిన ఉన్నత విద్యాసంస్థ.. ఏటా ఇక్కడ చదివి ఉత్తీర్ణులైన వేలాది మంది టెకీలు బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి ఐటీ, మెట్రోపాలిటన్ నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. కాగా కళాశాలల్లో ఇప్పటికీ మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని జేఎన్టీయూ కళాశాల శాశ్వత అధ్యాపకుల నియామకం చేపట్టలేదు. కాంట్రాక్టు అధ్యాపకులతోనే బోధన చేయిస్తుండటం విశ్వవిద్యాలయ చిత్తశుద్ధి అర్థమవుతోంది. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించి, సకాలంలో గ్రాంట్లు మంజూ రు చేసేలా ప్రభుత్వం స్పందించాలని అధ్యాపకులు, సిబ్బంది కోరుతున్నారు.

**శాశ్వత నియామకాలేవీ!**

జేఎన్టీయూ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 2010లో సెంటినరీకాలనీలో ఆరు బ్రాంచిలతో రెండు విద్యాసంస్థలను నెలకొల్పారు. రామగిరి మండలం పన్నూరులోని సింగరేణి స్థలంలో 53 ఎకరాల్లో కళాశాల ఏర్పాటు చేశారు. ఇక్కడ మొత్తం ఆరు గ్రూపులుండగా 1,584 మంది విద్యార్థులు చదువుతున్నారు. బ్లాక్–1, 2 భవనాల్లో (సివిల్, ఈఈఈ, మెకానికల్, సీఎస్ఈ, సీఎస్ఎం, మైనింగ్) 28 చొప్పున గదులున్నాయి. ప్రిన్సిపల్, ఈఈఈ హెచ్‌వోడీ మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు కాగా 44 మంది అధ్యాపకులు ఒప్పంద ప్రతిపాదికన విధులు నిర్వర్తిస్తున్నారు. కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థినీ, విద్యార్థులు వేర్వేరుగా వసతిగృహాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 210 గదుల్లో 750 మంది విద్యార్థులు, 180 గదుల్లో 510 మంది విద్యార్థినులు ఉంటున్నారు.

**మూడేళ్లుగా అందని ఉపకార వేతనాలు**

కళాశాలలో సీఎస్ఎం(ఏఐ, ఎంఎల్) బ్రాంచ్‌కు ప్రారంభం నాటి నుంచి అధ్యాపకులను నియమించలేదు. సీఎస్ఈ బ్రాంచ్ అధ్యాపకులే వీరికి బోధిస్తున్నారు. కళాశాలలో దాదాపు 20 మంది అధ్యాపకుల కొరత



ఉంది. మూడేళ్లుగా విద్యార్థులకు ఉపకార వేతనాలు రావడం లేదు. ప్రస్తుతం బీటెక్ వరకే కోర్సులు అందుబాటులో ఉండగా ఎంటెక్ కోర్సు ప్రారంభించాల్సి ఉంది. మైనింగ్‌లో సింగరేణి ఉద్యోగుల పిల్లల కోసం 36 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే సింగరేణి ఉద్యోగులు తమ పిల్లలను మైనింగ్‌లో కాకుండా, సీఎస్ఈలో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు అధ్యాపకులు చెబుతున్నారు. ఒప్పంద అధ్యాపకులు వెళ్లిపోతే గంటల ప్రాతిపదికన తాత్కాలిక అధ్యాపకులను నియమించుకుంటున్నారు.

**కనీస అవసరాలకూ కష్టమే!**కళాశాలలో మురుగు వెళ్లేందుకు సరైన వ్యవస్థ లేదు. సిబ్బంది కొరత ఉండటంతో పారిశుద్ధ్య సమస్యలు వేధిస్తున్నాయి. నాటిన మొక్కలకు సరైన రక్షణ లేదు. క్రీడలకు సంబంధించి సరైన మైదానమూ లేదు. విద్యార్థుల కోసం జిమ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ ఊసే లేదు. దీంతో విద్యార్థులు మూడు కిలోమీటర్లు నడిచి ప్రైవేట్ జిమ్ కేంద్రాలకు వెళ్తున్నారు. మరోవైపు కళాశాల డిస్పెన్సరీలో రెగ్యులర్ వైద్యుడు లేకపోవడం సమస్యగా మారింది. ప్రైవేటు వైద్యుడిని నియమించుకోగా, ఆయన సాయంత్రం 6 గంటలకు వచ్చి 9 గంటలకు వెళ్లిపోతున్నారు. కళాశాల క్యాంటీన్‌లో వసతులు సక్రమంగా లేకపోగా, గోడలు పగుళ్లు తేలాయి.

**ప్రతిపాదనలు పంపాం**

కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు జాబితా రూపొందించి ఇప్పటికే యూనివర్సిటీకి నివేదించాం. జిమ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. టెండర్ ప్రక్రియలో ఉంది. ఎంటెక్ కోర్సులు అందుబాటులోకి తేవడానికి ప్రయత్నిస్తున్నాం. అధ్యాపకులకు క్వార్టర్స్ నిర్మించాల్సి ఉంది. శ్రీధర్‌రెడ్డి, జేఎన్టీయూ మంథని కళాశాల ప్రిన్సిపల్

# ప్రహసనంగా సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ

పెద్దపల్లి : పల్లెల్లో మెరుగైన పారిశుద్ధ్యం కోసం గత ప్రభుత్వం అన్ని గ్రామాల్లో చెత్త విభజన నిల్వ కేంద్రాలు (సెగ్రిగేషన్ షెడ్లు) ఏర్పాటు చేసింది. ఇంటింటి నుంచి ప్రతి రోజూ తడి, పొడి చెత్త సేకరణ చేపట్టి వాటిని క్రమ పద్ధతిగా ఏరివేసి ఈ కేంద్రాలకు పంపించాలి. ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్, ఇతరత్రా వస్తువులను రీసైక్లింగ్ చేసి వాటిని విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలి. ఈ ఏడాది ఫిబ్రవరి 1న గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో కార్యదర్శులు, ఇతరత్రా అధికారులతోనే ప్రత్యేక పాలన నిర్వహిస్తున్నారు. ఇటీవల శాసన, లోక్‌సభ ఎన్నికలు జరగడంతో పర్యవేక్షణ లేక చెత్త సేకరణ ప్రహసనంగా మారింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంచాయతీల్లోనూ తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమం అంతంత మాత్రంగానే నడుస్తోంది.

**కంపోస్టు లేదు.. ఆదాయం రాదు**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,215 పంచాయతీలుండగా 1,211 పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. పెద్దపల్లిలో ఒకటి, జగిత్యాలలో ఒకటి, రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండేసి చోట్ల ఈ షెడ్ల నిర్మాణం పూర్తి కాలేదు. తొమ్మిది నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు రావడం లేదు. ట్రాక్టర్లు, చెత్త తరలింపు బండ్లు తరచూ మొరాయిస్తున్నాయి. సెగ్రిగేషన్ షెడ్డులకు చెత్తను తరలించి పంచాయతీలకు ఆదాయ రూపంలో సమకూర్చాలి. తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చాలి. పొడి చెత్తలో ప్లాస్టిక్, ఇతరత్రా వస్తు సామగ్రిని బహిరంగ విపణిలో విక్రయించగా వచ్చిన సొమ్మును పంచాయతీ బ్యాంకు ఖాతాకు మళ్లించాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలా ఎక్కడా చేయకపోవడంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి.

**సుల్తానాబాద్‌లో ప్లాస్టిక్ టైల్స్ పరిశ్రమ**

రెండేళ్ల క్రితం పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ బొంతకుంటపల్లి గ్రామంలో జూపల్లి సాయికిరణ్ అనే ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్త పీఎంఈజీపీ పథకం కింద రూ.40 లక్షలతో ‘పాలీసాండ్ పేవ్‌మెంట్ టైల్స్ ప్రాసెసింగ్ యూనిట్’ ను ప్రారంభించారు. జిల్లాలోని అన్ని పంచాయతీల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను కిలోకు రూ.5 చెల్లించి వాటిని తన గ్రామంలో ఏర్పాటు చేసిన టైల్స్ పరిశ్రమకు తీసుకొచ్చేలా అప్పటి జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళితో ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రతీనెల ప్లాస్టిక్ విక్రయాలతో పంచాయతీల స్వల్ప వ్యయాలకు సరిపోయేవి. ఇప్పుడు ఈ కార్యక్రమం సజావుగా సాగకపోవడంతో ఆ పరిశ్రమ నిర్వాహకుడు సిద్దిపేట, హైదరాబాద్‌ల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను తెప్పించి పరిశ్రమలో టైల్స్ తయారీ చేపడుతుండటం గమనార్హం.

కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాలో ప్రత్యేకంగా ప్లాస్టిక్ తయారీ యూనిట్లు లేవు. వర్మి కంపోస్టు ఎరువులు తయారు చేస్తున్నప్పటికీ స్థానిక అవసరాలకే వినియోగిస్తున్నారే తప్పా ఎగుమతులు చేయడం లేదు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడికక్కడ తుక్కు దుకాణాలకు విక్రయిస్తున్నారు.

సిద్దిపేట జిల్లాలో అన్ని పంచాయతీల నుంచి వచ్చే వ్యర్థాలను వర్మి కంపోస్టుగా మారుస్తూ వాటి ద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని సమకూరుస్తున్నారు. ప్రత్యేకంగా ఓ సంస్థ ఈ ఎరువును సేకరించి.. యంత్రాలతో ప్రాసెస్ చేసిన అనంతరం కిలోల కొద్ది సంచుల రూపంలో రైతులకు తక్కువ ధరల్లో విక్రయిస్తోంది.

# సర్కారు కంచె.. కలిపేసుకుంటే పోలా..

హైదరాబాద్: రెవెన్యూ రికార్డుల్లో లోపాలు... ధరణి పోర్టల్‌లో తప్పులను కొందరు రూ.కోట్లలోనే సొమ్ము చేసుకుంటున్నారు. పహణీ రికార్డుల్లో తమ పేర్లున్నాయంటూ తప్పుడు పత్రాలు సృష్టించి.. జిల్లా కోర్టుల్లో పిటిషన్లు వేసి వాటి ఉత్తర్వుల ఆధారంగా ధరణి పోర్టల్‌లో నమోదు చేయాలంటూ రెవెన్యూ అధికారులను అభ్యర్థిస్తున్నారు. ఈ-పాస్ పుస్తకాలు వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకుని వాటిల్లో నిర్మాణాలు చేపడుతున్నారు. తెరవెనుక కొందరు రియల్ ప్రతినిధులు.. తెరముందు రైతులుంటున్నారు. రైతుల పేర్లతో భూములు వచ్చాక.. హెచ్ఎండీఏ అనుమతులు తీసుకొని రియల్టర్లు నిర్మాణాలు చేపడుతున్నారు. శేరిలింగంపల్లి, గండిపేట, శంషాబాద్, నిజాంపేట, కుత్బుల్లాపూర్, జవహర్‌నగర్ మండలాల్లో ఈ తరహా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. గండిపేట్ మండలంలోని కోకాపేట్ సర్వే నంబర్ 117లో 8 ఎకరాల ప్రభుత్వ భూమి రికార్డుల్లో ఉంది. ప్రస్తుతం ఈ భూముల విలువ రూ.400 కోట్లు. రికార్డుల్లో భద్రంగా ఉన్నా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే 2 ఎకరాలు మాత్రమే ఖాళీగా ఉంది. అవీ ఆరేళ్ల క్రితం ప్రైవేటు వ్యక్తులు రైతుల నుంచి కొనుగోలు చేశారు. గతంలో ఇది ప్రభుత్వ భూముల్లో 'సర్కారు కంచె'గా నమోదైంది. సర్వే నంబర్ 117 నిషేధిత జాబితాలో ఉన్నా క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఈ సర్వే నంబర్‌లో రెండెకరాలను ఓ రియల్ వెంచర్ సంస్థ దర్జాగా ఆక్రమించుకుంది. బహుళ అంతస్తుల భవనాలను నిర్మించింది. మిగిలిన రెండు ఎకరాలు ప్రైవేటు వ్యక్తుల పేరుమీద ఉంది. ఇప్పటివరకు ఇవన్నీ గండిపేట్ రెవెన్యూ అధికారుల దృష్టికి రాలేదు. రెండు ఎకరాల్లో రహదారి నిర్మించిన ఏజెన్సీ రెవెన్యూ అధికారులకు సమాచారమే ఇవ్వలేదు.



ఆన్‌లైన్ రికార్డుల్లో ఉన్నా..
ధరణి పోర్టల్‌లో భూముల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉండడంతో ఎవరూ ఆక్రమించుకోరన్న నమ్మకంతో రెవెన్యూ అధికారులు ధీమాగా ఉన్నారు. దీంతోపాటు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తమ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్ వివరాలన్నింటినీ ప్రత్యేక సర్వర్ ద్వారా రెవెన్యూ అధికారులకు అందజేస్తున్నామని భావిస్తున్నారు. ఈ రెండూ ఆన్‌లైన్‌లోనే ఉన్నా రెండింటినీ అక్రమార్కులు ఏమార్చుతున్నారు. రెవెన్యూ రికార్డుల్లో తప్పుడు పేర్లను సృష్టించి ఆ ఆధారాలతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను సంప్రదిస్తున్నారు. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయ్ కదా అని వివరాలను చూసుకోకుండా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఫలానా సర్వేనంబర్‌లో వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేస్తున్నామంటూ రెవెన్యూ అధికారులకు సమాచారం ఇస్తే కబ్జాలకు ఆస్కారం ఉండదు.

## పర్యవేక్షణ కొరవడి.. బోధన కుంటుపడి

కరీంనగర్: ప్రైవేటు బడులకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నా.. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేక సర్కారు లక్ష్యం నీరుగారుతోంది. మండల స్థాయిల్లో పర్యవేక్షించే విద్యాధికారుల రెగ్యులర్ పోస్టులు ఏళ్లుగా ఖాళీగా ఉండటం ప్రభుత్వ తీరును వెక్కిరిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దశాబ్దకాలానికి పైగా ఇన్‌ఛార్జుల తోనే నెట్టుకొస్తున్నారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. వారు నాలుగైదు మండలాల బాధ్యతలు చూడాల్సి ఉంటుంది.


ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కొన్నేళ్లుగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా కొనసాగుతున్నారు. ఒక్కో ఎంఈవోకు రెండు నుంచి ఆరు మండలాల వరకు కేటాయించారు. కరీంనగర్‌లో అధిక సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక్కడి ఇద్దరు ఎంఈవోలకు ఆరు మండలాల చొప్పున అప్పగించడం గమనార్హం. ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా ఉన్న ప్రధానోపాధ్యాయులు ఇటు పర్యవేక్షణ బాధ్యతలకు, అటు పాఠశాలలకు న్యాయం చేయలేకపోతున్నారు. మరో వైపు ఏళ్లుగా ప్రభుత్వాలు పదోన్నతుల ద్వారా ఎంఈవో పోస్టులను భర్తీ చేయడంపై దృష్టి నిలపడం లేదు. ఫలితంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడుతోంది. ఏకీకృత సర్వీసు నిబంధనల విషయంలో సమస్యలతో పదోన్నతులతో ఈ పోస్టులను కొన్నేళ్లుగా ప్రభుత్వం భర్తీ చేయడంలేదు. కొత్తవారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వడం లేదు.

తలకు మించిన భారం..ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా ఉన్న ప్రధానోపాధ్యాయులు తమ బడితోపాటు వారికి కేటాయించిన మండలాల్లో పాఠశాలల పర్యవేక్షణ చేయాల్సి ఉంది. కనీసం నెలలో ఒక్కో మండలంలో 20కిపైగా పాఠశాలలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంటోంది. అధికారిక కార్యక్రమాలు, సమీక్షలకు హాజరుకావడం, మధ్యాహ్న భోజన నివేదికలు, బడుల్లో సదుపాయాలు, బోధన, ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు, ఉపాధ్యాయుల హాజరు, ప్రగతి నివేదికలు వంటి వాటిని పంపించడం వరకే వారికి సమయం సరిపోతుంది. పనిభారం పెరిగి పాఠశాలలపై పర్యవేక్షన కొరవడుతోంది.

ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో, ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పడిపోతున్నాయి. విద్యార్థుల ప్రవేశాలు ఏటా తగ్గుతున్నాయి. మరో వైపు ప్రధానోపాధ్యాయులుగా వారి వారి పాఠశాలల్లో కూడా పర్యవేక్షణకు సమయం దొరకడం లేదు. పర్యవేక్షణ కొరవడి ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలు అమలు కాని పరిస్థితి దాపురించింది.

నోడల్ అధికారులున్నా..సర్కారు బడుల్లోని సమస్యలను పరిష్కరించేందుకు, ఇన్‌ఛార్జి ఎంఈవోలపై అదనపు భారాన్ని తగ్గించేందుకు విద్యాశాఖ అధికారులు నోడల్ అధికారులను నియమించారు. ఆయా మండలాల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఈ బాధ్యతలు అప్పగించారు. వీరు ఎంఈవో విధుల్లో కొన్నింటిని మాత్రమే చేసేందుకు అర్హులు. అయినా ఎంఈవోలకు పనిభారం తప్పడం లేదు. అసలే పనిభారం, ఆపై రెండు, మూడు ఆపై మండలాల బాధ్యతలతో వారి విధుల నిర్వహణ గాడి తప్పుతోంది. ఈ పరిస్థితుల్లో సర్కారు బడుల్లో మెరగవుతున్న సదుపాయాలతో పాఠశాలల్లో విద్యాప్రమాణాలు, విద్యార్థుల సంఖ్య పెరగడమనేది ఎలా అనే విషయంపై పాలకులు, ప్రభుత్వం ఆలోచిస్తే తప్ప ఈ పరిస్థితి మారే అవకాశంలేదని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

# గ్రేటర్‌లో డెంగీ బెల్స్!




హైదరాబాద్: గ్రేటర్‌లో డెంగీ బెల్స్ మోగుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 900 డెంగీ కేసులు నమోదవగా...ఇందులో అధికం భాగ్యనగరంలోనివే. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగీ కేసులు నిర్ధారణ అవుతున్నాయి. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి ఎక్కువ మంది జ్వరంతో పరీక్షల కోసం వస్తున్నారు. ఇందులో పలు డెంగీ కేసులు సైతం బయట పడుతున్నాయి. వానాకాలం కావడంతో డెంగీకి కారణమయ్యే టైగర్ దోమ విజృంభిస్తోంది. గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 8 వేలకు పైనే కేసులు నమోదవగా... ఎక్కువ శాతం నగరంలోనే బయట పడ్డాయి. టైగర్ దోమ కుట్టిన 3-4 రోజుల నుంచే వంటి నొప్పులతో మొదలై తీవ్ర జ్వరం, తలనొప్పి వస్తుంది. తొలి దశ 3-5 రోజులు కొనసాగుతుంది. ఆ సమయంలో జ్వరం, ఒంటిపై దద్దుర్లు ఉంటాయి. రెండో దశలో బీపీ పడిపోవడం, ప్లేట్‌లెట్లు తగ్గడం, వాంతులు, కడుపులో నొప్పి, కాలేయంపై ప్రభావం కనిపిస్తుంది. కొన్నిసార్లు రోగి షాక్‌కు గురవుతారు. రెండో దశలో లక్షణాలు ఎక్కువగా ఉంటే ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం ఉంటుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

2-7 రోజులపాటు జ్వరం, ఒంటిపై దద్దుర్లు, తలనొప్పి, రక్తస్రావం, కంటి వెనుక నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు తదితర లక్షణాల్లో ఏవైనా రెండు, అంతకంటే ఎక్కువ కన్పిస్తే డెంగీగా అనుమానించాల్సిందే.

వెంటనే ఎన్ఎస్1 లేదంటే డెంగీ ఐజీఎం టెస్టు చేయించుకోవాలి. వాటిలో పాజిటివ్ వస్తే డెంగీగా నిర్ధారణ అయినట్లే. వెంటనే కంప్లీట్ బ్లడ్ పిక్చర్(సీబీపీ) చేయించుకోవాలి. శరీరంలో ప్లేట్‌లెట్ల సంఖ్య ఈ పరీక్ష ద్వారా తెలుస్తుంది. ఆరోగ్యవంతుల్లో 1.5 లక్షల నుంచి 4 లక్షల వరకు ప్లేట్‌లెట్లు ఉంటాయి. డెంగీ వచ్చిన వారిలో ఇవి తగ్గుతాయి. కొందరిలో ముందు రోజు లక్ష ఉంటే...మరుసటి రోజుకు 70 వేలకు ఆ తర్వాత 50 వేలకు పడిపోతుంటాయి. ఇలాంటి వారిని వెంటనే ఆసుపత్రిలో చేర్పించాలి.కొందరిలో ప్లేట్‌లెట్లు తగ్గుతున్నా.. రెండు, మూడు రోజులపాటు బయటకు లక్షణాలు కన్పించవు. అయితే శరీరంలో లోలోపల రక్తస్రావం జరిగిపోతుంది. ఒక్కసారిగా కుప్పకూలిపోయి కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంటుంది. సీబీపీ ద్వారా ఎప్పటికప్పుడు ప్లేట్‌లెట్ల సంఖ్య తెలుసుకోవడం అవసరం.

డెంగీకి కచ్చితమైన మందులు లేవు. జ్వరం తగ్గటానికి పారాసిట్మాల్, ఇతర ఇన్‌ఫెక్షన్ల నివారణకు యాంటీబయోటిక్స్, ఐవీ ఫ్లూయిడ్స్, ఎలక్ట్రోలైట్స్ అందిస్తారు. ఈ సీజన్‌లో వచ్చే ఏ జ్వరాన్ని నిర్లక్ష్యం చేయడానికి వీలు లేదు.

# ఆదేశాలు అర్థంగాక.. అన్నింటికీ రెడ్‌మార్క్



హైదరాబాద్ : ఆదాయపుపన్ను శాఖ అధికారుల ఆదేశాలను రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు తప్పుగా అర్థం చేసుకోవడంతో హైదరాబాద్ శివారు వట్టినాగులపల్లి గ్రామంలోని రైతులు, భూయజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూములు ఇతరులకు విక్రయించాలన్నా.. కుటుంబ సభ్యుల పేరుతో మ్యుటేషన్ చేయించాలన్నా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల వద్ద 'రెడ్'మార్క్ ఉండడంతో క్రయవిక్రయాలు, మ్యుటేషన్ చేయించుకునేందుకు ఆదాయపుపన్ను శాఖ, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఏం జరిగిందటే..హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉంటున్న ఓ వ్యక్తి రూ.19.27కోట్ల ఆదాయపు పన్ను చెల్లించకపోవడంతో వట్టినాగులపల్లిలోని అతడి భూమిని జప్తు చేశామని, ఆ భూమిని ఎవరూ కొనకూడదంటూ ఆరేళ్ల క్రితం ఆదాయపు పన్నుశాఖ అధికారులు శేరిలింగంపల్లి సబ్‌రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. సర్వేనంబర్‌లోని ఒక వ్యక్తి భూమితోపాటు 300 ఎకరాలు కూడా కొనుగోలు చేయకూడదేమోనన్న భావనతో రిజిస్ట్రేషన్ అధికారులు వాటిపై 'రెడ్'మార్క్ ఉంచారు.

నిరభ్యంతర పత్రాలుంటేనే..పహాణీ రికార్డులు, పట్టాదార్ పాసుపుస్తకాల్లో తమ పేర్లు ఉండడంతో వట్టినాగులపల్లి రైతులు, భూయజమానులకు ఎలాంటి అనుమానం రాలేదు. యథావిధిగా పంటలు పండిస్తున్నారు. ఐటీ కారిడార్ సమీపంలో ఉన్న భూముల్లో కొందరు భూయజమానులు సొంతంగా ఇళ్లు కట్టుకుంటున్నారు. అపార్ట్‌మెంట్లు నిర్మించుకుంటున్నారు.

కొద్దినెలల క్రితం ఒక రైతు ఎకరం భూమిని ఓ స్థిరాస్తి సంస్థకు విక్రయించేందుకు గండిపేట్ ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లగా.. తన భూమిని ఆదాయపు పన్నుశాఖ ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ అధికారులు జప్తు చేశారని తెలుసుకున్నారు. పట్టాదార్ పాసు పుస్తకాలు, రైతుబంధు పథకం వివరాలను రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులకు చూపించగా.. ఆరేళ్ల క్రితం పొరపాటు జరిగుంటుందని, ఆదాయపు పన్నుశాఖ అధికారుల వద్దకు వెళ్లి నిరభ్యంతర పత్రం తీసుకురావాలంటూ సూచించారు. ఆయన వెళ్లి ఆదాయపు పన్నుశాఖ అధికారులను సంప్రదించగా.. వారం రోజులు రికార్డులు పరిశీలించిన అనంతరం నిరభ్యంతర పత్రాన్ని ఇచ్చారు. కొద్దిరోజుల తర్వాత అదే సర్వేనంబర్‌లోని కొందరు భూయజమానులు మ్యుటేషన్ కోసం వెళ్లగా.. రెవెన్యూ అధికారులు తిరస్కరించడంతో మళ్లీ ఆదాయపు పన్నుశాఖ వద్దకు వెళ్లి నిరభ్యంతర పత్రం తెచ్చుకున్నారు.

పునరాలోచిస్తేనే...వట్టినాగులపల్లిలోని సర్వేనంబర్ 135 నుంచి 281లలో ఉన్న 300ఎకరాలను రైతులు, భూయజమానులు అమ్మాలన్నా, కొనాలన్నా ఆదాయపుపన్ను శాఖ అధికారులు వారిచ్చిన ఆదేశాలపై పునరాలోచిస్తేనే అనుమతులిస్తామని గండిపేట మండల రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. తాము జప్తుచేసిన భూమి వరకూ క్రయవిక్రయాలపై నిషేధం విధించాలంటూ ఆదాయపుపన్ను శాఖ అధికారులు శేరిలింగంపల్లి రిజిస్ట్రార్ కార్యాలయానికి తాజాగా లేఖ రాస్తే అప్పుడు ఇతరులకు ఇబ్బందులు తొలగిపోతాయని వివరించారు. అప్పటివరకూ ఇన్‌కంట్యాక్స్, రిజిస్ట్రేషన్ శాఖల నిరభ్యంతర పత్రాలుంటేనే తాము మ్యుటేషన్ చేస్తామని స్పష్టంచేశారు.

వట్టినాగులపల్లి పరిసర ప్రాంతాల్లో విల్లాలు, బహుళ అంతస్థుల నిర్మాణం కొనసాగుతుండడంతో భూములు విక్రయించాలని నిర్ణయం తీసుకున్నవారు ఆదాయపు పన్నుశాఖ నుంచి నిరభ్యంతర పత్రం తీసుకుంటే.. పన్ను చెల్లించమంటారేమోనని అక్కడికి వెళ్లేందుకు జంకుతున్నారని తెలిసింది.

# యాప్‌తో.. నిర్వాసితులకు భరోసా!



హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మూసీ నది ప్రక్షాళనకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. బల్దియా, జలమండలి, హెచ్ఎండీఏ, రెవెన్యూ, పోలీసు తదితర విభాగాల ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా గండిపేట నుంచి ఘట్‌కేసర్ వరకు ఆక్రమణలను గుర్తిస్తున్న సంగతి తెలిసిందే. మొత్తం 33 బృందాలు ఈ ప్రక్రియలో పాలుపంచుకుంటున్నాయి. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న కుటుంబాల వివరాలను పక్కాగా సేకరిస్తున్నారు. నదికి అటు, ఇటు 50 మీటర్లలోపు ఉన్న ఆక్రమణలు, నిర్వాసితుల సమాచారాన్ని ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. భవిష్యత్తులో ఆయా కుటుంబాలను వేరేచోట పునరావాసం కల్పించాల్సివస్తే.. అన్ని విధాలుగా భరోసా ఇచ్చేందుకు పక్కాగా డాటా రూపొందిస్తున్నారు. గండిపేట నుంచి ఘట్‌కేసర్ వరకు ఆక్రమణలను బృందాలు మార్కింగ్‌చేశాయి. ముఖ్యంగా రాజేంద్రనగర్, ఆసిఫ్‌నగర్, గోల్కొండ, బహదూర్‌పుర, నాంపల్లి, అంబర్‌పేట్, ఉప్పల్‌లో ఎక్కువ శాతం ఆక్రమణలను బృందాలు గుర్తించాయి. ఇప్పటివరకు అన్ని మండలాలు కలిపి దాదాపు రూ.12,182 ఆక్రమణలు ఉన్నట్లు తేల్చారు. అబ్దుల్లాపూర్‌మెట్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో పరివాహక ప్రాంతంలో వ్యవసాయ భూములు కూడా ఉన్నాయి. వీటికి పరిహారం ఇవ్వాలా.. ల్యాండ్ పూలింగ్‌తో సేకరించి 40-60 నిష్పత్తిలో అభివృద్ధి చేసి రైతులకు కేటాయించాలా... అనే విషయంపై చర్చ నడుస్తోంది. మొత్తంగా ఆక్రమణల గుర్తింపు ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. నెలాఖరు నాటికి పూర్తి స్పష్టత రానుందని అధికారులు చెబుతున్నారు. తర్వాత అసలు కార్యాచరణ ప్రారంభంకానుంది.

మాస్టర్ ప్లాన్‌కు అడుగులు మూసీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికకు సంబంధించి బృహత్తర ప్రణాళికలకు అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు అధికారులు టెండర్లు పిలిచారు. తద్వారా గండిపేట నుంచి ఘట్‌కేసర్ వరకు పరివాహక ప్రాంతాల్లో ఎలాంటి అభివృద్ధి, వ్యాపార, వాణిజ్య, పర్యాటక కార్యక్రమాలు చేపట్టాలి, ఆదాయ మార్గాలకు ఉన్న అవకాశాలు, నదిలోకి మురుగు నీరు చేరకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి.. ఇతరత్రా వివరాలను చర్చించి. విధివిధానాలకు రూపకల్పన చేయనున్నారు. ప్రస్తుతం గ్రేటర్‌లో ఉత్పత్తి అవుతున్న మురుగు మొత్తం మూసీలోకి చేరుతోంది. నిత్యం 1900 మిలియన్ లీటర్లు ఉత్పత్తి అవుతుండగా.. కేవలం 740 మిలియన్ లీటర్లను జలమండలి శుద్ధిచేసి వదులుతోంది. శుద్ధిలేకుండా నేరుగా చేరుత్ను మురుగే నదిని తీవ్రంగా దెబ్బతీస్తోంది. దిగువన ఉన్న ప్రాంతాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. కొత్తగా చేపడుతున్న 32 ఎస్టీపీలతో మరో 800 మిలియన్ లీటర్ల వరకు శుద్ధిచేసే అవకాశం రానుంది. తీరం వెంట భారీ ఎత్తున వ్యర్థాల పారబోత సైతం విచ్చలవిడిగా సాగుతోంది. ఆక్రమణల కంటే ఈ చర్యలు మూసీకి సంకటంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో దాదాపు 55 కిలోమీటర్ల మేరకు నదికి ఇరువైపులా రహదారులు, ఆక్రమణల తొలగింపు, నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం, ట్రంక్ సివర్ మెయిన్లు నిర్మించి పూర్తి స్థాయిలో ప్రక్షాళనకు నడుం బిగించాలని ప్రభుత్వం భావిస్తోంది.

# చెప్పినట్లు వింటేనే.. సీ'ఎస్'ఆర్

హైదరాబాద్: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులపై పలు సంస్థలు జీహెచ్ఎంసీకి ముందస్తు షరతులు పెడుతున్నాయి. పలువురు అధికారులు అందుకు సరే అంటున్నారు. దాంతో.. విలువైన జీహెచ్ఎంసీ ఆస్తులు ప్రైవేటు కేంద్రాలుగా మారుతున్నాయనే ఆరోపణలొస్తున్నాయి. సామాజిక సేవ కోసం చేపడుతోన్న పనుల్లోనూ.. కొన్ని సంస్థలు లాభాన్ని ఆశిస్తున్నాయనే విమర్శలొస్తున్నాయి.

జంతు సంరక్షణ కేంద్రంపై.. నగరంలో వీధి కుక్కల సంతతిని అరికట్టడంలో జీహెచ్ఎంసీ విఫలమవుతూనే ఉంది. ఇదేంటని అడిగితే.. సరిపడా జంతు సంరక్షణ కేంద్రాలు లేవని అధికారులు చెబుతున్నారు. దాంతో.. రెండేళ్ల క్రితం శేరిలింగంపల్లిలోని గోపన్‌పల్లిలో, కాటేదాన్‌లో కేంద్రాలను నిర్మించేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. అందులోని ఓ కేంద్రాన్ని.. రూ.2 కోట్ల సీఎస్ఆర్ నిధులతో కట్టేందుకు



ఓ ప్రైవేటు సంస్థ ముందుకొచ్చింది. జంతు సంరక్షణ కేంద్రంలో జంతు దహన వాటిక, పశువైద్యశాలను కూడా నిర్మించాలని సదరు ప్రైవేటు సంస్థ షరతు విధించింది. అక్కడ నిర్మిస్తోన్న ఆస్పత్రిని తాము సూచించిన వ్యక్తికే ఇవ్వాలని పేర్కొంది. నెల, రెండు నెలలకు కాదని, ఏకంగా 25ఏళ్లపాటు ఆస్పత్రి భవనాన్ని లీజుకు అడుగుతున్నారని ఓ ఉన్నతాధికారి ఆందోళన వ్యక్తం చేశారు.చెరువుల్లోనూ..పలు చెరువులను సీఎస్ఆర్ నిధులతో సుందరీకరి స్తామని పలు నిర్మాణ సంస్థలు ముందుకొచ్చాయి. తాము ఎంపిక చేసిన చెరువుల పక్కనే నిర్మాణాలను చేపట్టాయి. అక్కడ తవ్వకంలో వచ్చే మట్టిని చెరువు చుట్టూ వేసి, పనులు పూర్తి చేసినట్లు చెబుతున్నారు.


క్రీడా మైదానాలపైనా కన్ను..

నగరంలోని క్రీడా మైదానాలు, స్పోర్ట్స్ కాంప్లెక్సులను సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసేలా బల్దియా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా పలు సంస్థలను ఆహ్వానిస్తోంది. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం తమకు కేటాయించాలని ఓ క్రీడా సంస్థ జీహెచ్ఎంసీని ఆశ్రయించింది. అయితే.. శిక్షణ రుసుమును రూ.2వేలకు పెంచాలని సదరు సంస్థ కోరడంతో..అధికారులు వెనక్కి తగ్గారు.

# మానేరుపైనే ఆశలు నిండితేనే పంటల సాగు

గంభీరావుపేట : మానేరు జలాశయంలో నీరు లేక అన్నదాతలు పంటల సాగుకు వరుణుడిపైనే ఆశలు పెట్టుకున్నారు. కొందరు నారు మడులు వేసినా నీరు లేక ఎండిపోతున్నాయి. కొన్నిచోట్ల నారు ముదిరిపోతుంది. గత రెండేళ్లు ఆదుకున్న మానేరు జలాశయంలో ఈ ఏడాది నీటి మట్టం పడిపోవడంతో పంటలకు వదిలే పరిస్థితి లేదు. దీంతో ఏం చేయాలో తోచక అన్నదాతలు దిగులు చెందుతు న్నారు.రైతులు వానాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఎరువులు, విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. బోర్లు, బావులు ఉన్న చోట నారుమడులు పోశారు. వర్షాలు లేక చాలా చోట్ల ఎండిపోతున్నాయి. గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాలకు ప్రధాన ఆధారమైన నర్మాల ఎగువ మానేరు జలాశయం. దీని ఆయకట్టు రైతులు మాత్రం ఈసారి వరుణుడిపైనే ఆశలు పెట్టుకున్నారు. ప్రాజెక్టులో నీటి మట్టం నామ మాత్రంగా ఉండటమే ఇందుకు కారణం. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 31 అడుగులు కాగా, ప్రస్తుతం తొమ్మిది అడుగులు మాత్రమే ఉంది. భారీ వర్షాలు కురిసి పల్వంచ, కూడెల్లి వాగు నుంచి వరద భారీగా వస్తే జలాశయం నిండితేనే ఆయకట్టు రైతుల పంటలు పండుతాయి. దాదాపు ఆయకట్టు కింద అధికారికంగా 13 వేల ఎకరాలు సాగు అవుతుంది.

కాళేశ్వరం జలాలు వచ్చేనా!



కాళేశ్వరం జలాలు గత రెండేళ్లు ఎగువమానేరు జలాశయంలోకి రావడంతో రెండు పంటలు పూర్తిగా పండాయి. అదేవిధంగా ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లో కొన్ని చెరువులను కాళేశ్వరం జలాలతో రైతులు నింపుకొన్నారు. వర్షాలతో సంబంధం లేకుండా రైతులు సాగు చేసుకున్నారు. వేసవిలో సైతం నిండుకుండను తలపించింది. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. వేసవిలో పంటలు ఎండిపోతున్నాయంటే 0.5 టీఎంసీ నీరు అందించారు. ప్రస్తుతం మానేరు జలాశయంలో ఉన్న నీటిని విడుదల చేసే పరిస్థితి లేదు. చెరువుల్లో సైతం నీరు లేకపోవడం రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో సిద్దిపేట జిల్లా మల్లన్నసాగర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు. ఈసారి నీటి విడుదలపై అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. వానలు పడేదెప్పుడో, జలవనరులు నిండేదెప్పుడోనని అన్నదాతలు వర్షాల కోసం ఎదురుచూస్తోన్నారు.

నారు మడికి ట్యాంకర్‌తో నీటి తడులు

వర్షాలు లేక నారు మడి ఎండిపోతుండటంతో ట్యాంకర్‌తో నీళ్లు పోశాను. గతంలో ఇలాంటి సమస్య రాలేదు. వర్షాలు లేకపోయినా మానేరు జలాశయం నుంచి సాగుకు నీరు వదిలేవారు. మల్లన్నసాగర్ నుంచి వేసవి కాలంలో సైతం మానేరు జలాశయాన్ని నింపడంతో జలకళను సంతరించుకుంది. వర్షాలు సైతం సమృద్ధిగా కురిశాయి. ఈ వానాకాలం వరుణుడు ముఖం చాటేశాడు. సాగుకు నీరు లేదు.

రత్నాకర్, నర్మాలవర్షాలు పడకుంటే కష్టమే

మానేరు జలాశయం కింద నాకు ఎనిమిది ఎకరాలు ఉంది. నారు పోశాను. వర్షాలు లేవు. చాలా మంది రైతులు ఆందోళన చెందుతున్నా రు. రెండు సంవత్సరాలు ఎలాంటి ఇబ్బంది లేకుండా వర్షాలు పడ్డాయి. మానేరు జలాశయం నుంచి నీరు వచ్చింది. ఇప్పుడు ఇందులో కూడా నీరు లేదు. రైతుల కష్టాలు చూసి ప్రభుత్వం ఆలోచించాలి.తిరుపతిరావు, నర్మాల

# ప్రభుత్వ హాస్టళ్ల దుస్థితిపై కేటీఆర్ ఫైర్..



హైదరాబాద్: "మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి" అని అన్నారని.. మొత్తానికి.. కాంగ్రెసోళ్లు వచ్చారు.. పెద్ద మార్పే తెచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో దుస్థితి.. పురుగుల అన్నం.. నీళ్ల చారు ఉండేవన్నారు. ఈనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో ఇంకా అధ్వాన్న పరిస్థితి ఉందన్నారు. బల్లిపడిన టిఫిన్లు %-% చిట్టెలుకలు తిరిగే చట్నీలు పిల్లలకు వడ్డిస్తున్నారన్నారని ఫైర్ అయ్యారు. మొన్న భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాలలో.. కలుషిత ఆహారం తిన్న విద్యార్థి జీవితం విషాదాంతంగా మారిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. నిన్న కోమటిపల్లి హాస్టల్‌లో ఉప్మాలో బల్లి పడి.. 20 మంది విద్యార్థులకు వాంతులు అయ్యాయన్నారు. సుల్తాన్ పూర్ జేఎన్టీయూ హాస్టల్‌లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో విద్యార్థులు బెంబేలెత్తుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఈ విషాహారం తింటే.. విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరని ప్రశ్నించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులకు భరోసా ఎక్కడుందని నిలదీశారు. కలుషిత ఆహారం వల్ల... పిల్లలు ఆడుకోవాల్సిన వయసులో ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. అస్తవ్యస్థంగా మారిన ప్రభుత్వ వ్యవస్థ వల్లే.. విద్యార్థులకు ఈ అవస్థ... ఈ అస్వస్థత.. అని పేర్కొన్నారు. ఇకనైనా కాంగ్రెస్ సర్కారు కళ్లు తెరవాలన్నారు. లేకపోతే.. భావిభారత పౌరుల నిండు ప్రాణాలకే ప్రమాదమన్నారు. వైఫల్యాలను సరిచేయకపోతే ఊహించని విషాదం చోటు చేసుకుంటుందని తెలిపారు.

## అబార్షన్ చేయించాడు.. రాజ్‌తరుణ్-లావణ్య కేసులో కొత్త ట్విస్ట్



సినీ నటుడు రాజ్ తరుణ్ తనతో పదేళ్లుగా రిలేషన్‌లో ఉండి మోసం చేశాడంటూ లావణ్య అనే యువతి హైదరాబాద్‌లోని నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తర్వాత లావణ్య, మాల్వీ ఒకరిపై ఒకరు ఫిర్యాదులు కూడా చేసుకుంటుండడంతో ఈ కేసు రోజురోజుకు మలుపులు తిరుగుతూ తాజాగా ఓ కొత్త టర్న్ తీసుకుంది. ఈ రోజు పోలీసులు రాజ్ తరుణ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పుడు ఈ ఘటన టాలీవుడ్‌లో సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళితే.. లావణ్య మరోసారి రాజ్ తరుణ్, మాల్వీలపై ఫిర్యాదు చేసింది. అంతే కాకుండా పోలీసులకు కొన్ని ముఖ్య ఆధారాలు ఇచ్చినట్లు సమాచారం. వాటిలో రాజ్ తరుణ్‌తు ఉన్న 170 ఫొటోలు, ఇంకా పలు టెక్నికల్ అండ్ మెడికల్ ఎవిడెన్స్‌లు అందజేసింది. దీంతో నార్సింగ్ పోలీసులు హీరో రాజ్ తరుణ్ పై ఐపీసీ 493 సహా మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే.. రాజ్‌తరుణ్‌తో పదేళ్ల క్రితమే పెళ్లి అయ్యిందని, పదేండ్లుగా కాపురం చేశామని.. కొన్నాళ్ల క్రితం ప్రెగ్నెన్సీ వస్తే అబార్షన్ చేయించాడంటూ లావణ్య ఆరోపించింది. అందుకు సంబంధించి మెడికల్ డాక్యుమెంట్స్‌ను పోలీసులకు అందించానని తెలిపింది. అంతేకాకుండా చాలాకాలం అన్విక పేరుతో కలిసి ఉన్నామని.. అదే పేరుతో విదేశాలకు కూడా కలిసి వెళ్లినట్లు లావణ్య పేర్కొంది. కొంతకాలం క్రితం కానీ మాల్వీ మల్హోత్రా వచ్చాక రాజ్‌తరుణ్ తనను దూరం పెట్టాడని.. మాల్వీ కోసం రాజ్‌తరుణ్ ముంబైలో ఎక్కువగా ఉంటున్నాడని, అతను ఎప్పుడెప్పుడు ఉంబయ్‌కి వెళ్లింది, ఎవరింటికి వెళ్లింది, ఎన్ని రోజులు ఉన్నాడు అనే చాలా విషయాలకు సంబంధించి అధారాలు ఉన్నట్లు వివరించింది.

# రేవంత్ ప్రభుత్వంలో నిరుద్యోగులపై దమన కాండ

హైదరాబాద్: రేవంత్ ప్రభుత్వంలో నిరుద్యోగులపై దమన కాండ నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. యూనివర్సిటీ హాస్టళ్లల్లో కరెంటు కూడా తీసేస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ , బీసీ మంత్రులకు అధికారులకు అడుగడుగునా అవమానం జరుగుతోందని చెప్పారు. ఈరోజు (బుధవారం) తెలంగాణ భవన్‌లో బాల్కసుమన్ మీడియాతో మాట్లాడుతూ.. యాదాద్రి గుడిలో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకి అవమానం జరిగిందని, నిన్న బల్కం పేట ఎల్లమ్మ గుడిలో పొన్నం ప్రభాకర్‌కు అవమానం జరిగిందని అన్నారు. దళిత ఎస్ ఐ శ్రీరాములు శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ పాలనలో మాటల్లో తప్ప చేతల్లో సామాజిక న్యాయం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి అందర్నీ బెదిరించే ధోరణిలో మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నిన్న మహబూబ్ నగర్‌లో నిరుద్యోగులను అవమాన పరిచేలా సీఎం రేవంత్ మాట్లాడిన తీరును ఖండిస్తున్నామన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని నిరసనలు అణచి వేద్దామనుకుంటున్నారా అని ప్రశ్నించారు. నిరుద్యోగుల అండతో గద్దె నెక్కిన రేవంత్ ఇప్పుడు వారిని అణచి వేస్తున్నారని ఫైర్ అయ్యారు. రేవంత్ కడప వెళ్లి ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల కోసం ఊరూరు తిరుగుతానని అంటున్నారని విమర్శించారు. సమైక్య వాదుల కోసం రేవంత్ తాపత్రయ పడుతున్నారని బాల్కసుమన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.




దిల్లీ: ముస్లిం మహిళలకు భరణం ఇచ్చే విషయంలో బుధవారం సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. విడాకుల తర్వాత వారు కూడా భరణానికి అర్హులని స్పష్టం చేసింది. 125 సీఆర్‌పీసీ ప్రకారం విడాకులు తీసుకున్న తన భార్యకు భరణం చెల్లించాలంటూ ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ఓ ముస్లిం వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టీన్, జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. విడాకుల తర్వాత తమ భర్త నుంచి వారు భరణం కోరవచ్చని తీర్పునిచ్చింది.
భరణానికి సంబంధించిన హక్కును కల్పించే ఆ సెక్షన్‌ను విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు వర్తింపజేస్తున్నట్లు తెలిపింది. "సెక్షన్ 125 వివాహితలకే కాకుండా మహిళలందరికీ వర్తిస్తుంది. మతంతో సంబంధం లేకుండా ఈ సెక్షన్ కింద వివాహితలు భరణం కోరవచ్చు. భరణం ఇవ్వడం అనేది దాతృత్వం కాదు. భార్య తమపై మానసికంగా, ఇతర రకాలుగా ఆధారపడి ఉంటుందనే వాస్తవాన్ని కొందరు భర్తలు గుర్తించడం లేదు. గృహిణి పాత్రను, ఆమె త్యాగాన్ని గుర్తించాల్సిన సమయం వచ్చింది" అని ధర్మాసనం తీవ్రంగా స్పందించింది.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194





## భారత్-చైనా సరిహద్దులో 108 కిలోల బంగారం పట్టివేత!

లద్ధాఖ్: భారత్- చైనా సరిహద్దులో అక్రమంగా రవాణా చేస్తున్న 108 కిలోల బంగారాన్ని భద్రతాదళం స్వాధీనం చేసుకొంది. ముగ్గురు వ్యక్తులను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ ఘటన తూర్పు లద్దాఖ్‌లో చోటు చేసుకొంది. జులై 9న తూర్పు లద్దాఖ్‌లో ఇండో-టిబెటన్ బార్డర్ పోలీసు (ఐటీబీపీ) బలగాలు గస్తీ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే స్మగ్లింగ్ గురించి సమాచారం అందడంతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను ప్రశ్నించారు. సోదాలు చేయగా 108 కిలోల బంగారు కడ్డీలతో పాటు రెండు మొబైల్ ఫోన్లు, బైనాక్యులర్, రెండు కత్తులు, చైనాకు చెందిన కొన్ని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఐటీబీపీ వెల్లడించింది. ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపింది.

ఇందులో ఇద్దరు లద్దాఖ్‌లోని న్యోమా ప్రాంతానికి చెందినవారిగా భద్రతా దళాలు గుర్తించాయి. ఆ ప్రాంతంలో ఇంత భారీ మొత్తంలో బంగారాన్ని స్వాధీనం చేసుకోవడం ఇదే తొలిసారి.




## తండ్రీకుమార్తె బంధంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రణీత్ అరెస్టు..

హైదరాబాద్: సోషల్ మీడియాలో తండ్రీకూతురు బంధంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కీచకుడు ప్రణీత్ హనుమంతును తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు బెంగళూరులో అరెస్టు చేశారు. బెంగళూరు కోర్టులో ప్రణీత్‌ను హాజరు పరిచి ట్రాన్సిట్ వారంటీ మీద హైదరాబాద్‌కు తీసుకురానున్నారు. ఇప్పటికే హనుమంతుతోపాటు మరో ముగ్గురిపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఓ వీడియో ఆధారంగా సోషల్ మీడియాలో తండ్రీకూతురుపై చర్చపెట్టి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వారిపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు తాజాగా ఒకరిని అరెస్టు చేశారు. మ్నెదట ఆ వీడియో చూసిన సినీ హిరో సాయిధరమ్ తేజ్ వారిపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ విషయాన్ని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులకు ఎక్స్(ట్విటర్)లో ట్యాగ్ చేశారు. చిన్నారులపై ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మంచు మనోజ్, మంచు లక్ష్మి సైతం ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యసమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు ఉన్నాయంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యూట్యూబర్స్ తీరుపై ఆగ్రహించిన సీఎం రేవంత్ రెడ్డి తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో తెలంగాణ డీజీపీ రవి గుప్తా నిందితులపై కేసు నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేశారు. చిన్నారులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ప్రణీత్ హనుమంతు సహా మరో ముగ్గురిపై కేసులు నమోదు చేశారు.




## నేరగాళ్లకు ప్లాస్టిక్ సర్జరీలు.. ఫిలిప్పీన్స్ రహస్య ఆసుపత్రుల్లో కొత్త దందా..!

చట్టం నుంచి తప్పించుకోవడానికి నేరగాళ్లు ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకోవడం మనం సినిమాల్లో చూస్తుంటాం. కానీ, ఫిలిప్పీన్స్‌లో ఇది వాస్తవ రూపం దాల్చింది. వారి రూపురేఖలు మార్చేందుకు ఏకంగా రహస్య ఆస్పత్రులనే నిర్వహిస్తున్నారు. కుంభకోణాలు, తీవ్రమైన నేరాలకు పాల్పడినవారు అరెస్టు నుంచి తప్పించుకొనేలా ప్లాస్టిక్ సర్జరీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల అక్రమంగా నిర్వహిస్తున్న ఇలాంటి రెండు ఆసుపత్రులను మూసివేయించేందుకు రంగం సిద్ధం చేశారు. ఆ దేశ రాజధాని మనీలా దక్షిణ శివార్లలోని పాసే అనే పట్టణంలో మే నెలలో పోలీసులు రైడ్ చేశారు. అక్కడ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ టూల్స్, డెంటల్ ఇంప్లాంట్స్, స్కిన్ వైట్‌నింగ్ ఐవీ డ్రిప్స్‌ను స్వాధీనం చేసుకొన్నారు. వీటి సాయంతో ఓ మనిషి రూపురేఖలు పూర్తిగా మార్చేయవచ్చని ప్రెసిడెన్షియల్ యాంటీ ఆర్గనైజ్డ్ క్రైం అధిపతి జాన్ కాసియో పేర్కొన్నారు. ఇక్కడ ముగ్గురు డాక్టర్లను అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు వియత్నాం వాసులు కాగా.. ఒకరు చైనా పౌరుడు. వారికి అక్కడ పని చేయడానికి అనుమతులు లేవు. మరో రెండు అక్రమ ఆసుపత్రులు ఇలాంటి వ్యవహారాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి నిఘా పెట్టారు. ఇవి పాసే పట్టణంలోని వైద్యశాల కంటే నాలుగు రెట్లు పెద్దవని పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చే పేషెంట్ల గుర్తింపుకార్డులను ఎవరూ అడగరని అధికారులు చెబుతున్నారు. ఇక్కడికొచ్చే క్లైయింట్లలో ఎక్కువమంది ఆన్‌లైన్ కేసినోలకు చెందినవారని, దీంతోపాటు ఫిలిప్పీన్స్‌లో అక్రమంగా పనిచేస్తున్నవారు ఉన్నట్లు అధికారులు చెప్పారు. 2022లో చైనా మాఫియాగా అనుమానిస్తున్న ఓ వ్యక్తిని ఫిలిప్పీన్స్ అధికారులు అరెస్టు చేశారు. అతడు చట్టం నుంచి తప్పించుకొనేందుకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకొన్నట్లు గుర్తించారు. ఇక్కడి ఆన్‌లైన్ కేసినోలు చైనాలోని జూదగాళ్లకు సేవలు అందిస్తుంటాయి. అక్కడ గ్యాంబ్లింగ్ నేరం. ఇక ఈ సంస్థలే టెలిఫోన్ స్కామ్‌లు, హ్యూమన్ ట్రాఫికింగ్‌లకు పాల్పడుతుంటాయి. గత ప్రభుత్వం ఉన్న సమయంలో ఇవి మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్నట్లు సాగాయి. కానీ, కొత్తగా మార్కోస్ జూనియర్ అధికారంలోకి వచ్చాక ఫిలిప్పీన్స్‌పై స్కాం దేశంగా ముద్ర పడటాన్ని ఇష్టపడలేదు. దీంతో చర్యలు చేపట్టారు.

# మల్లారెడ్డికి మరో భారీ షాక్.. 15 మంది జంప్..!

హైదరాబాద్, జులై 10: మాజీ మంత్రి మల్లారెడ్డికి మరో భారీ షాక్ తగిలింది. ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్‌ను వీడారు 15 మంది కార్పొరేటర్లు. దీంతో ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ బలం మరింత పెరిగింది. త్వరలోనే ఫిర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం కానుంది. అయితే, ఈ 15 మంది కార్పొరేటర్లతో డిప్యూటీ మేయర్ శివకుమార్ ఆధ్వర్యంలో గోవాలో క్యాంప్ రాజకీయం నడుపుతున్నారు. మొన్న జవహర్ నగర్, నిన్న బోడుప్పల్ కాంగ్రెస్ కైసవం అయ్యాయి. అదే బాటలో ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కూడా హస్తగతం కానుంది. మరోవైపు పార్టీ మారుతున్న కార్పొరేటర్లను మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి నిలువరించలేకపోయారు. వారిని అడ్డుకోలేక చేతులెత్తేశారు. ఈ వ్యవహారంలోనే మంగళవారం నాడు జరిగిన ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ మీటింగ్‌లో రసాభాస చోటు చేసుకుంది. తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లను కిడ్నాప్ చేశారని.. బలవంతంగా, బెదిరింపులకు పాల్పడి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఇదిలాఉండగా.. ఎమ్మెల్యేలే పార్టీలు మారుతున్న వేళ కార్పొరేటర్లు సైతం తామెంత అనుకుంటూ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఇక్కడ మరో ప్రచారం కూడా జరుగుతోంది. గత కొంత కాలంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరిగింది. ఇటీవలి కాలంలో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది. ఇలాంటి తరుణంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 15 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మల్లారెడ్డే వెనుక ఉండి ఇదంతా నడిపిస్తున్నారా? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660